# లోకులు....

శ్రీ అరసాడ ధర్మారావు

రోదన ధ్వనులు మిన్నుముట్టుతున్నాయి. ఒక్కొక్క స్వరం హృదయాన్ని వెయ్యి గంగాప్రవాహాల్ని పారిస్తూంది. అబ్బా! భరించలేం! ఆ వాతావరణం అతి కరుణామయం. దృశ్యం మహాఘోరం!

నేనూ, చంద్రం నిన్న సాయంత్రమే షికారు వెళ్ళి వచ్చామే! ఈ ఒక్క రాత్రిలోనే ఎంతటి దారుణ విపత్తు అతణ్ణి చుట్టుముట్టింది? కలలోకూడా అనుకోలేదే? ఆహా యేమి ప్రపంచం! యేమి బ్రతుకులు!

ఏడీ! చంద్రం యేడీ! అడుగో! తన పాపాయి దగ్గర కూర్చున్నాడు. ఆ దుఃఖమూర్తి హృదయం ఎంత కల్లోల సముద్రం అయిందో! అందులోంచి రేగే భావవీచికలకి రూపురేఖలు నిర్ణయించగలమా? పాపం యేడవడానికి ఆడజన్మ యివ్వలేదు కదా భగవంతుడు! ఆహా చంద్రం! నీ స్థితి వర్ణనాతీతం కదా! పాపాయిని ఆడిస్తూ కూర్చున్నావా?-అవును, ఈ సమయంలో దాన్ని చూచే వాళ్ళెవళ్లు?

చంద్రం! నీవంటి భాగ్యశాలి ఎవరూ లేరనుకున్నామే! ఎన్నెన్ని తపస్సుల ఫలితమో ఇలా మానవజన్మ యెత్తింది అనుకున్నామే! అంతా బుద్బుదప్రాయం అయిపోయిందికగా.

ఏమి దివ్యదాంపత్యం మీది? ఎంతటి పవిత్ర ప్రేమజీవులు మీరు! సుధ నిజంగా మానవరూపం ధరించిన ఆ దివ్య సుధే! ఇంకా సందేహమా? అనురాగ జీవననందనారామంలో ఈ ఐదేళ్లు అమరసౌఖ్యాలతో ఇట్టే గడిచిపోయినట్టు అనిపిస్తూంది. సుధని భార్యగా బడయజాలిన నీవు ఎంతటి ధన్యుడవోయ్!

అంకురించి, అభివృద్ధిపొంది, చిగిరించి, మొగ్గతొడిగి, పువ్వులు పూసిన మీ ప్రేమ వృక్షం ఇప్పుడు ఫలించి పరిపూర్ణతత్వం పొందిందని చూచినవాళ్ళంతా మురిసిపోతూవుంటే అయ్యో, ఇప్పుడీ మహాఘోరం యేమిటి?

అనురాధ!......ఎంత చక్కటి పేరు! మీ అనురాగ ఫలానికి ఇంత చక్కని పేరు ఏర్చికూర్చి పెట్టడానికి ఎంత శ్రమపడ్డారో మీ దంపతులు! ఎంతగా మురిసిపోయారో! అదంతా యిప్పుడేమయింది! ఇవాళే కదూ బారసాల మహోత్సవం జరపాలనుకున్నారు!

కాలపురుషుడు ఎంత కన్నులుపొడుచుకున్నాడోయ్! మీ దివ్య దాంపత్యానికి ఎంత అసూయపడ్డాడోయ్! పదకొండురోజుల పురిటి మంచంమీది నుంచే ఆ సుకుమార సుందర పవిత్ర ప్రేమమూర్తిని తన ప్రియతముని నుంచీ, తన ముద్దుల పాపాయి నుంచి ఒక్క రాత్రిలోనే శాశ్వతంగా వేరుచెయ్యడానికి అతడికి చేతులెల్లా వచ్చాయో! ప్రేమజీవుల జీవితకావ్యంలో ఆమె దివ్యమధుర జీవితం ఒక్క పేజీయైనా పూర్తికాకమునుపే ముగిసిందే! అయ్యో, నిన్నేమని సమాశ్వాసించగలను?—

ఓహో, వాళ్ళేమిటేమిటో నిన్ను గురించి అంటున్నారు, అవేమిటో విందాం—

“తాత ముత్తాతల నుంచి ఆచారంగా వస్తూ ఉంది మేనమామకూతురును వివాహం కోరడంమాలో. అది తప్పించి పైసంబంధం చేసుకున్నాడుమా వాడు. నేను శతపోరినా లాభం లేకపోయింది. సత్యమైన దారిని నడవక ఏమవుతుంది?’ — చంద్రం నాన్నగారే యీ మాటలు? ఆయన చాదస్తం యిప్పటికీ పోలేదే? ఇదేనా సమయం యీ మాట అనడానికి? అయినా ఆయుర్దాయానికి, సాంప్రదాయానికి సంబంధం యేమిటి? ఆ మేనమామ కూతురైతే మాత్రం?—ఆయుర్దాయం తక్కువైనా సాంప్రదాయం బలంవల్ల చిరంజీవి అవుతుందేమిటి? ఈ అజ్ఞానం ఎప్పుడు పోతుందో?—

“అయ్యో తల్లీ నీకు ఎంతలోనే నూరేళ్ళు నిండాయే! నిన్నెల్లా మరచిపోగలనే? నీ మొగుడికేం

చెప్పావే? అయ్యో, నిజంగా యిప్పుడు వాడే చచ్చిపోయాడే!"—అంటూ యేడుస్తూంది చంద్రం తల్లి. పాపం ఆ కన్నతల్లి హృదయం చెరువైపోతూంది కదా!

"అయ్యో కూతురా! నువ్వు బ్రతకాలని ఎందరో దేముళ్ళకి మొక్కానే!—ఒక్కడూ చక్రం అడ్డువెయ్యలేక పోయాడే!-కలకాలం నాకు కడుపుచిచ్చు పెట్టిపోయావే!"—సుధ తల్లి గావాల్ను యేడుస్తూంది—కూతురుమీద పడి.

ఆ ముసలాయన ఏమిటో అంటున్నాడు విందాం.—"నే నెరుగుదును—ఎనిమిదో రోజున పురిటిజబ్బు ప్రవేశించినవాళ్ళు జీవితానికింకా నీళ్ళువదులుకోవలసిందే. మా మరదలూ—మా మేనగోడలూ ఈ విధంగానే పోయారు."—ఓహో, ఏమి అనుభవం! ఏమి అనుభవం!—

"బాబుకు ద్వితీయ వివాహయోగంరాసివుంది. ఋణానుబంధ రూపేణ పశుపత్ని సుతాలయాః, ఋణం చెల్లించుకొని ఆమె వెళ్ళిపోయింది. ఏడ్చి ఏం ప్రయోజనం?మరోసంబంధ మేదన్నా చూడండి!" ఇవి వేదాంత శిరోమణిగారి వాక్యాలు గావాలి! ఇంకా శవం ఇంట్లోంచి కదలనేలేదు కదా, అప్పుడే రెండో పెళ్లి ముచ్చట్లా? ఈ ద్వితీయ వివాహం యోగం ఆడవాళ్ళకు మాత్రం రాసిపెట్టడు గావాలి భగవంతుడు!—

"ఎవరికైనా విధివ్రాత తప్పించుకోవడానికి వశమౌతుందా బాబూ!"—గడ్డం దువ్వుకుంటూ ఆయెవరో ముసలాయన అంటున్నాడు.

"ముందుచేసిన కర్మ యిప్పుడు అనుభవానికి వచ్చింది"—వితంతు యోగిని.

"వాడికష్టం తినేయోగం లేదు దానికి"—ఒక ముసలావిడ.

"కాకై కలకాలం జీవించేకంటే—హంసై ఆర్నెల్లు బ్రతికితే చాలదూ"—ఒక యిల్లాలు...

చిలకా గోరింకల్లాగు తిరుగుతూవుంటే చూడలేక విడదీశాడు వాళ్ళను దేముడు!"—ఒక వితంతువు.

"శిశువు మాతృగండంలో పుట్టింది. నేను అప్పుడే అనుకున్నాను. చూశారా!"-జ్యోతిష్కుడు.

"నేను మూడో పెళ్ళి చేసుకున్నానని ఫలితం ఊరికే పోతుందా?"—మూడు కాళ్ళ ముసలి బ్రాహ్మడు.

ఆహా, యేమిలోకం!—అయితే సుధ చావుకు ఏది కారణం? సాంప్రదాయ తిరస్కారమా! పెద్దల్ని వెక్కిరించిన ఫలమా?—పూర్వజన్మకర్మ విధివ్రాతా?—ద్వితీయ వివాహయోగమా? మాతృగండ యోగమా? ఛీ ఛీ — అర్థంలేని కూతలు! ఇల్లాంటి వాళ్ళనే భారత ప్రభుత్వం మరమ్మతు చెయ్యాలని మాస్తుంది. ఈ అజ్ఞానం ఇప్పట్లప్పట నశిస్తుందా? ఒక శతాబ్దమైన చాలదేమో!


ఆయుర్వేద వైద్యనిలయం - వారి

"లుకోరియా క్యూర్"

అద్భుత కుసుమరోగ నివారిణి.

స్త్రీలకు తరుచు సంభవించు శ్వేతరక్త ప్రదరరోగములకు, బహిష్టు నొప్పులకు దివ్యౌషధమని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుటవలన ఇతర గర్భాశయ వ్యాధులను కూడ నిర్మూలించి వంధ్యత్వమును తొలగించును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము కనుగొనబడిన ఆయుర్వేద ఔషధము.

90 మాత్రల ప్యాకెట్టు—వెల రు. 2-8-0.

ప్యాకింగు పోస్టేజి అదనము.

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట, మచిలీపట్నం.

అన్ని మందుల షాపులలోనూ దొరకును.